

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి  ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన  ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**మేము కబుర్లు** చెప్పుకుంటుండగా వెన్నెల వచ్చింది. హనీష వెన్నెల గురించి చెప్పిన కబుర్లు, ఇంకా తన పేరువల్ల ఎంతో అందంగా ఊహించుకున్నాను. అందవికారంగా లేకపోయినా నేను ఊహించుకున్నంత అందంగా అయితే లేదు. పొడవాటి జుట్టు, చక్కటి కనుముక్కు తీరు, కళతో వెలిగిపోయే ముఖాన్ని ఊహించుకున్నాను. అలా కాకుండా మామూలు అమ్మాయిల్లానే ఉంది.

హాయ్ వెన్నీ, తిను మన టెంపరెరీ రూం మేట్ అవని" హనీష పరిచయం చేసింది.

"హాయ్ అవని. హౌ ఆర్ యు."

"ఐయాం ఫైన్. హౌ ఆర్ యు?"

"ఐం ఓకే. ఎప్పుడొచ్చావ్?"

"ఒక టు అవర్స్ అవుతుంది"

"ఓ. జెట్ లాగ్ ఉందా?"

"లేదు. ఇప్పుడలవాటైపోయింది"

"అప్పుడే?" ఆశ్చర్యంగా హనీష మొహం చూసింది.

"తను డైరెక్ట్ ఇండియానుంచి కాదు. కొలరాడోలో వాళ్ళ అన్నయ్య దగ్గర వారం ఉండి వచ్చింది."

"ఓ. ఓకే ఓకే. నేను అదే షాక్ అయ్యాను. మీ అన్న ఇక్కడే ఉన్నాడు కాబట్టి నీకు పెద్దగా ప్రాబ్లమ్స్ రావులే... అంటే వచ్చినా మీ అన్నహెల్ప్ చేస్తాడంటున్నా. తప్పుగా అనుకోకు"

"ఛ. తప్పుగా ఏం అనుకోటల్లేదు."

"తను కూడా ఏరో స్పేస్" హనీష చెప్పింది.

"అవునా? నైస్. ఇక్కడ అందరూ భయపెడతారు కానీ నువ్వు వాళ్ళని పట్టించుకోకు" వెన్నెల చెప్పింది.

"ఆల్రెడీ స్టార్ట్ చేసారు" హనీష బదులిచ్చింది.

"అప్పుడేనా? పెద్దగా నవ్వి "నువ్వు కరెక్ట్‌గా క్లాస్ విని అసైన్‌మెంట్స్ టైంకి సబ్మిట్ చేస్తే హాఫ్ A వచ్చినట్టే. ఎక్జామ్స్ బట్టి మిగిలిన మార్కులు ఉంటాయి. ఏవైనా డౌట్స్ ఉంటే డైరెక్ట్‌గా మీ ప్రొఫెసర్‌ని అడుగు. నేను వీక్‌డేస్ బిజీగా ఉంటాను కానీ వీకెండ్స్ హెల్ప్ చేస్తా. ఫస్ట్ సెమిస్టర్ చాలా ఇంపార్టెంట్. తక్కువ GPA వస్తే మిగిలిన సెమిస్టర్స్ దాన్ని బాలెన్స్ చెయ్యడానికే అయిపోతుంది. 3 కన్నా తక్కువ GPA వస్తే డిపార్ట్‌మెంటే మారాలి. నేను వచ్చినప్పుడు ఏడుగురుం ఏరోస్పేస్‌లో జాయిన్ అయ్యాము. సెకెండ్ సెమిస్టర్‌కి ఐదుగురుం ఉన్నాం. సమ్మర్ కల్లా ముగ్గురం. గ్రాడ్యుయేట్ అయ్యింది నేనొక్కదాన్నే. మిగిలినవాళ్ళు డిపార్ట్ మెంట్స్ మారిపోయారు. ఒకమ్మాయి ఇండియాకి వెళ్ళిపోయింది. ఇవన్నీ విని భయపడకు. 4 జిపిఏ ఈజీనే.

అంత డిఫికల్ట్ కాదు. నువ్వు క్లాస్‌లో అటెంటివ్ ఉండాలి అంతే. అన్ని క్లాసెస్ కంపల్సరీ అటెండ్ అవ్వు. క్లాస్‌కి వెళ్ళకపోతే నీ ప్రొఫెసర్‌కి ఈ మెయిల్ చెయ్యి"

"సరే"

"ఫస్ట్‌డేనే లెక్చర్ పీకకు వెన్నీ. నాకు ఆకలేస్తుంది" హనీష అంది.

"ఏం వండను?" వెన్నెల అడిగింది.

"దోసకాయ కూర చెయ్యనా?" హనీష బదులిచ్చింది.

"కూరకాదు కానీ పప్పు చేస్తా. నేను ప్రొటీన్ సరిగ్గా తినట్లేదు. ఓకే నా నీకు?"

"యా.ఓకే. ఇండియాలో మా అమ్మ చేస్తే యాక్ అనేదాన్ని. ఇప్పుడు ఇష్టంగా తినాల్సొస్తుంది."

"ఇండియాకి వెళ్ళినప్పుడు మీ అమ్మ ఏం వండినా తింటావులే యింక"

"లేదు మా అమ్మ పప్పు ఎప్పుడూ గట్టిగానే ఉంటూంది. సరిగ్గా ఉడకపెట్టదు."

అది విన్నాక నేను నవ్వు ఆపుకోలేకపోయాను.

"నీకు ఓకేనా?" వెన్నెల నన్ను అడిగింది.

"నాకు వద్దు. ఐం ఓకే" అన్నాను.

"మొహమాటపడకు అమ్మా, ఆవకాయ పచ్చడి కూడా ఉంది"

"ఆకలేయట్లేదు"

"అలా మొహమాట పడితే చాలా కష్టం. ఇక్కడ కొంచెం అవన్నీ పక్కన పెట్టాలి. నేను వండుతా, నీకు నచ్చితే తిను"

"సరే. హెల్ప్ చెయ్యనా?

"ఉల్లిపాయలు కోస్తావా?" ఇద్దరూ ఒకేసారి అడిగారు.

"యా. కోస్తా"

"హమ్మయ్య. ఆ కళ్ళమంట నావల్లకాదు నేను స్నానం చేసి వస్తా. ఏదైనా సినిమాపెట్టు హనీ" లోపలికి వెళ్ళింది వెన్నెల.

"నీకు ఎలాంటి సినిమాలు ఇష్టం?" హనీష అడిగింది.

"నాకు కామెడీ ఇష్టం. ఈ మధ్య జంధ్యాల సినిమాలు చూస్తున్నా."

"నీకు పాత సినిమాలు ఇష్టమా?"

"యా"

"వెన్నీకి బ్లాక్ అండ్ వైట్ సినిమాలంటే పిచ్చి"

"నాకు బ్లాక్ అండ్ వైట్ బోరు కొడతాయి. మరీ అంత పాతవి చూడను"

నేను ఓన్లీ కొత్తవి చూస్తా. కొన్నిసార్లు మాత్రం వెన్నీతో పాతవి చూస్తాను."

"నీ ఫేవరెట్ హీరో ఎవరు?"

"రవితేజ. నీకు?

"నాగార్జున"

"నాకూ ఇదివరకు నాగార్జున చాలా నచ్చేవాడు. రోజూ తినేప్పుడు నేను, వెన్నీ ఏదో ఒక సినిమా చూస్తాము. వంట స్టార్ట్ చేసినప్పుడు టైటిల్స్ స్టార్ట్ చేస్తాము. పడుకునేంత వరకు బాక్‌గ్రౌండ్‌లో అది ప్లే అవుతూనే ఉంటుంది.ఎప్పుడూ చూడని సినిమా అయితేనే కుదురుగా కూర్చుని చూస్తాం. ఇవాళ నువ్వు సెలెక్ట్ చెయ్యి సినిమాని"

"మీ ఇష్టం. నాకు ఏదైనా పరవాలేదు"

"జంధ్యాలదే ఏదో ఏదో ఒక సినిమా చెప్పు."

"మా అన్నయ్య బాబాయ్ అబ్బాయ్ సినిమా బావుంటుందని చెప్పాడు. అది చూద్దామా?"

"బాబాయ్ అబ్బాయా? సెంట్‌మెంటా?"

"కామెడీ. సెంటీ కాదనుకుంటా."

"సరే చూద్దాం ఇవాళ్ళ రాత్రి"

"నచ్చకపోతే మార్చేద్దాం."

"పర్లేదులే. ఓన్లీ బాక్ గ్రౌండ్‌లో డైలాగ్స్ వినొచ్చు"

ఇంతలో వెన్నెల వచ్చింది "వంట స్టార్ట్ చేద్దామా?"

"యా, ఒకే" అన్నాను.

"నేను రైస్ పెడతాను" హనీష చెప్పింది.

ముగ్గురం కిచెన్‌లోకి వెళ్ళాము. కబుర్లు చెప్పుకుంటున్నంతసేపు మర్చిపోయిన దిగులు కిచెన్‌ని చూడగానే పొంగుకొచ్చింది. హనీష బియ్యం కడిగి కుక్కర్ ఆన్ చేసి తన లాప్ టాప్‌లో బాబాయ్ అబ్బాయ్ సినిమా పెట్టింది. నేను ఓ మూల ఉల్లిపాయలు కోసి వెన్నెలకి ఇచ్చాను. ఆ తరవాత ఎన్నిసార్లు అడిగినా తను సహాయం వద్దని, హనీషతో కూర్చుని సినిమా చూడమని చెప్పింది. పప్పు ఉడికే వాసనకి ఆకలి తెలిసింది. వెన్నెల వంట పూర్తిచేసి వచ్చింది. మా పక్కన కూర్చుని

"ఇది బాలకృష్ణ సినిమానా?" పెద్దగా నవ్వింది.

"ఎంత యంగ్‌గా ఉన్నాడో కదా" హనీష అంది.

ముగ్గురం నవ్వాము. ఇంతలో కుక్కర్ విజిల్ మోగింది. తినడం పూర్తయ్యాక కూడా సినిమా అయ్యేంతవరకు ముగ్గురం నవ్వుతూ ఉన్నాము. సినిమా పూర్తయ్యాక కొంచెం సేపు మాట్లాడుకున్నాం. ఆ తరవాత వెన్నెల హాల్లో పరుపు మీద, హనీష రూంలో పరుపు మీద పడుకున్నారు. నాకు హనీష రూంలో ఒక కంఫటర్, పడుకునేముందు ఓ దిండు, పరుపు బదులు రగ్గు ఇచ్చారు. మొదటిరోజు ఇబ్బంది లేకుండా గడిచినందుకు దేవుడికి దండం పెట్టుకుని కళ్ళు మూసుకున్నాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story